ప్రజలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్: లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

హుజూరాబాద్ టౌన్/ వీణవంక, సెప్టెంబర్ 25: నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను ఎప్పుడూ అండగా ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం హుజూరాబాద్, వీణవంక మండలాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్వయంగా వారి ఇండ్లకు వెళ్లి పంపిణీ చేశారు. అలాగే వీణవంక మండలం ఇప్పలపల్లి, మామిడాలపల్లి గ్రామాల్లో ప్రమాదాలకు గురై మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున బీఆర్‌ఎస్ తరపున బీమా చెక్కులను అందజేశారు. బ్రాహ్మణపల్లి చెక్‌డ్యాం వరదకు కొట్టుకుపోయిన రైతుల భూముల గురించి ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకొని, వారికి న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు రాణీసురేందర్ రెడ్డి, ముసిపట్ల రేణుకాతిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండల్ రెడ్డి, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ మండలాధ్యక్షుడు ఐలయ్య, మాజీ జడ్పీటీసీలు బక్కారెడ్డి, మాడ వనమాలాసాధవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు ఉన్నారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు బతుకమ్మ సంబురాలు

వేడుకల్లో పాల్గొన్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచానికి మన తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పిన గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై పారమిత విద్యార్థుల అవగాహన ర్యాలీ

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు తెలంగాణచౌక్ వద్ద సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణం ఎలా ప్రభావితమవుతుందో తెలియజేసే పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన మైమ్ (ముఖాభినయం) అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'పాడనా తీయగా'

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25: దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా సంగీత, సాంస్కృతిక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఫిలిమ్ భవన్‌లో 'పాడనా తీయగా' కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కళాకారులు హాజరై ఎస్పీబీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాలు లేని లోటు తీర్చలేనిదన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన గాయని, గాయకులు, వాయిద్య కళాకారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోగుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిలివేరు శ్రీకాంత్, కోశాధికారి గౌరవేణి బాబు, ప్రోగ్రాం కన్వీనర్ తిప్పబత్తిని రవి, కళాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, సెప్టెంబర్ 25: నగరంలోని 11కేవీ బ్యాంకు కాలనీ ఫీడర్‌లో పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేస్తున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు మెహిఫిల్ బార్ వెనుక ప్రాంతం, అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్ ఏరియా, వావిలాలపల్లెలో కొంత ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే నగరంలోని 11కేవీ ఇండస్ట్రియల్/పద్మనగర్ ఫీడర్‌లో కొత్త డీటీఆర్, లైన్ పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పద్మనగర్, ఫ్రొ స్టాప్ ఏరియా, ప్రగతి నగర్, లారెల్ స్కూల్, సాయిబాబా గుడి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టెండర్ ప్రకటన

St'George International High School Kothapally,KNR. తేది: 02-10-2024 నుండి 11-10-2024 వరకు NCC క్యాంపులో Grocery: బియ్యం, పప్పు, మసాల దిన్సులు, కూరగాయలు సప్లై చేయుటకై టెండర్లు కోరడమైనది. ఆసక్తి గలవారు తమ కొటేషన్లను CO 9 (T) బెటాలియన్ పేరిట తేది: 25-09-2024 వరకు ఇవ్వవలసినదిగా కోరడమైనది.

చిరునామా: NCC Office, Near D-Mart Road, Karimnagar. Cell: 70850 56800, 8493903101

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నిజామొద్దీన్

వీణవంక, సెప్టెంబర్ 25: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న నిజామొద్దీన్ బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ లక్ష్మణ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వావిలాలపల్లి శాఖ
చిరునామా: తుకారాం కాంప్లెక్స్, వావిలాలపల్లి, కరీంనగర్ జిల్లా.
టెలిఫోన్ నెం: 83568 15831;ఇ-మెయిల్: UBIN0815837@unionbankofindia.bank

స్వాధీనతా ప్రకటన
{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1)}
(స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వావిలాలపల్లి బ్రాంచ్** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద (యాక్ట్ 54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 3,13,21,814.11/- (మూడు కోట్ల పదమూడు లక్షల ఇరవై ఒక్క వేల ఎనిమిది వందల పద్నాలుగు రూపాయల పదకొండు పైసలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు చార్జీలను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత: **1. మెసర్స్ మీనాక్షి పౌల్ట్రీ ఫామ్ మరియు హామీదారులు: 1) శ్రీ బండ వీరేశం, తండ్రి: బండ లక్ష్మీనారాయణ, 2) శ్రీమతి బండ విజయలక్ష్మి, భర్త: వీరేశం, 3) శ్రీమతి తొడుపునూరి గీత, భర్త: టి.సతీష్, 4) శ్రీ తొడుపునూరి ఆశిష్ కుమార్, తండ్రి: తొడుపునూరి రామాంజనేయులు, 5) శ్రీమతి మడప్ సమిత మనోహర్‌రావు, భర్త: జి.వీరరఘునందన్‌రావు, 6) శ్రీ గాడర్ల నారాయణరెడ్డి, తండ్రి: గోపాల్‌రెడ్డి, 7) శ్రీమతి గంప నర్సవ్వ, భర్త: లక్ష్మీనారాయణ, 8) శ్రీమతి బందుగుల కవిత, భర్త: బి.హరికిషన్, 9) శ్రీ గాడర్ల ఉదయ్ కుమార్, తండ్రి: నారాయణరెడ్డి, 10) జి.వీరరామకృష్ణరావు, తండ్రి: స్వర్గీయ మాధవరావు, 11) జి.వీరరఘునందన్‌రావు, తండ్రి: స్వర్గీయ మాధవరావు, 12) తొడుపునూరి సతీష్ కుమార్, తండ్రి: తొడుపునూరి ఓంకారం**లను కోరుతూ 01-07-2024 తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేశారు.

రుణగ్రహీతలు/హామీదారులు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాల్ని వినియోగించి దిగువ వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు **21 సెప్టెంబర్ 2024న** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవీ జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరుపు ఏవేని లావాదేవీలు 29-06-2024 నాటికి **రూ. 3,13,21,814.11/- (మూడు కోట్ల పదమూడు లక్షల ఇరవై ఒక్క వేల ఎనిమిది వందల పద్నాలుగు రూపాయల పదకొండు పైసలు మాత్రమే)** ప్లస్ గతంలో రాబట్టుకోని వడ్డీ మరియు దానిపై వడ్డీ మరియు ఛార్జీలు కలిపి సదరు మొత్తం కొరకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** చార్జ్‌కి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత/హామీదారులను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు రుణగ్రహీతకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

స్థిరాస్తుల వివరణ

1) ఆస్తి యజమాని: శ్రీ గూడూరు వీరరఘునందన్‌రావు, తండ్రి: స్వర్గీయ మాధవరావు, శ్రీ గూడూరు వీరరామకృష్ణరావు, తండ్రి: స్వర్గీయ మాధవరావు, మెసర్స్ మీనాక్షి పౌల్ట్రీ ఫామ్‌కి ఆస్తిని లీజుకు ఇచ్చినవారు: శ్రీ గూడూరు వీరరఘునందన్‌రావు, తండ్రి: స్వర్గీయ మాధవరావు, శ్రీ గూడూరు వీరరామకృష్ణరావు, తండ్రి: స్వర్గీయ మాధవరావు, మెసర్స్ మీనాక్షి పౌల్ట్రీ ఫామ్‌కి ఆస్తిని లీజుకు ఇచ్చినవారి పేరున ఉమ్మడిగా కలిగి ఉండి, మానకొండూరు గ్రామం మరియు మండలం, కరీంనగర్ జిల్లా వద్ద గల, సర్వే నెం.లు 1388, 1389, 1408లో ఎక. 3-37 గుంటలు విస్తీర్ణం భూమి మరియు మొత్తం పౌల్ట్రీ షెడ్స్. **ఆస్తి సరిహద్దులు: తూర్పు:** మానకొండూరు చెరువు, **పడమర:** ఇతరుల వ్యవసాయ భూమి, **ఉత్తరం:** గూడూరు వీరరామకృష్ణరావు మరియు ఇతరుల వ్యవసాయ భూమి మరియు వారి స్వంత దారి, **దక్షిణం:** ఇతరుల వ్యవసాయ భూమి. కరీంనగర్ జిల్లా, మానకొండూరు గ్రామం మరియు మండలం, సర్వే నెం. 1388, 1389 మరియు 1408 వద్ద గల, మెసర్స్ మీనాక్షి పౌల్ట్రీ ఫామ్‌లో మొత్తం **మెషినరీ, యూనిట్‌గల ప్లాట్ సరిహద్దులు: తూర్పు:** మానకొండూరు చెరువు, **పడమర:** ఇతరుల వ్యవసాయ భూమి, **ఉత్తరం:** గూడూరు వీరరామకృష్ణరావు మరియు ఇతరుల వ్యవసాయ భూమి మరియు వారి స్వంత దారి, **దక్షిణం:** ఇతరుల వ్యవసాయ భూమి.

2) ఆస్తి యజమాని: బండ విజయ లక్ష్మి.
బండ విజయ లక్ష్మికి చెంది ఉండి, సబ్-జిల్లా మరియు జిల్లా రిజిస్ట్రేషన్ కరీంనగర్ అధికార పరిధిలో, సిటీ మున్సిపల్ కార్పొరేషన్ కరీంనగర్ పరిధిలో, కరీంనగర్ సిటీలోని కట్టరాంపూర్ లొకాలిటీ వద్ద గల, సర్వే నెం. 889 మరియు 891లో **"శాతవాహన రెసిడెన్సీ"**కు చెందిన, ఈ ఫ్లాట్‌లో ఏర్పాటు చేయబడిన సెల్లార్‌లో కార్‌పార్కింగ్ ఏరియా (60.00 చ.అ.) అదనంగా ఉన్న, నాలుగవ అంతస్తులో ఆర్‌సిసి స్ట్రక్చర్, 1380 చ.అ. ప్లింత్ ఏరియా (కామన్ ఏరియాతో సహా) గల, మున్సిపల్ డోర్ నెం. 8-2-461/51 కలిగిన ఫ్లాట్ నెం. 508. **ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు:** కారిడార్, **పడమర:** ఖాళీ మరియు తరువాత ఫ్లాట్ నెం. 506, **ఉత్తరం:** ఖాళీ, **దక్షిణం:** కారిడార్. **బిల్డింగ్ గల మొత్తం ప్లాట్ సరిహద్దులు: తూర్పు:** 40 అ.వెడల్పు రోడ్ (స్టేడియం నుండి పి.జి. కాలేజి రోడ్), **పడమర:** 20 అ. వెడల్పు రోడ్, **ఉత్తరం:** ఎస్.ఆనందం, వి.రాజేశం, ఎం.లక్ష్మీనారాయణ మరియు స్వామి యొక్క భూమి, **దక్షిణం:** కె.నారాయణ మరియు రాములు ఇల్లు.

తేది: 21-09-2024
ప్రదేశం: కరీంనగర్
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

యువతలో ఉపాధి నైపుణ్యాలు పెంచాలి

- వివిధ కోర్సులపై శిక్షణ శిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

బీసీ బాలికల హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబర్ 25: డిమాండ్‌కనుగుణంగా జిల్లాలోని యువతలో ఉపాధి నైపుణ్యాలు పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో పలు శాఖల అధికారులతో కలిసి నైపుణ్యాభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డీఆర్‌డీఏ, మెప్మా సంస్థల ఆధ్వర్యంలో పదిమంది కంటే ఎక్కువగా పని చేసే వ్యాపారాలు, ప్రైవేట్‌సంస్థలను సంప్రదించి, వారి అవసరాలకు అనుగుణంగా డిగ్రీలోపు చదివిన యువతను గుర్తించి, శిక్షణ ఇప్పించాలన్నారు. ఒకేషనల్ కోర్సులు కూడా అందించాలని సూచించారు. వివిధ విభాగాల్లో కోర్సులపై శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని శిక్షణ కలెక్టర్ అజయ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి కమిటీ కన్వీనర్ తిరుపతిరావు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నవీన్‌కుమార్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, డీఆర్‌డీవో, కార్మికశాఖ అధికారి, లీడ్‌బ్యాంక్ మేనేజర్, జిల్లా వ్యవసాయాధికారి, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

అక్టోబర్ 1న నిర్వహించనున్న వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లాలో నిర్వహించనున్న వయోవృద్ధుల వారోత్సవాల గోడప్రతులను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల బాధ్యులు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, సముద్రాల జనార్దన్‌రావు, పెండ్యాల కేశవరెడ్డి, సీడీపీవో సబిత తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ

నగరంలోని వెనుకబడిన తరగతుల బాలికల కళాశాల వసతి గృహ సముదాయాన్ని కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు, మెనూ అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో బాలికలకు సరిపడా బెడ్స్‌ను మంజూరు చేస్తామన్నారు. శ్రద్ధతో చదువుకొని భవిష్యత్‌లో రాణించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఎం. అనిల్ ప్రకాశ్, వార్డెన్ శ్రీదేవి ఉన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

విద్యానగర్, సెప్టెంబర్ 25: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టీబీ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రయివేట్ డాక్టర్లు కూడా టీబీ పేషెంట్లకు వైద్య చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో సుజాత, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, సెప్టెంబర్ 25 : చొప్పదండి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని గర్శకుర్తి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూ, సాక్సులు అందజేశారు. సీఆర్‌ఆర్ నిధులు రూ.1.50 కోట్లతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మధురానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ముగ్గురికి రూ.7,49,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, ఎంఈవో వేణుకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్ద మనసు చాటుకున్న ఎమ్మెల్యే

చొప్పదండి నియోజకవర్గంలోని 200 విద్యార్థులు పైబడి చదువుతున్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సొంత ఖర్చుతో ఉదయం పూట అల్పాహారం, సాయంత్రం 10వ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందజేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిర్ణయించుకున్నారు. బుధవారం మండలంలోని గర్శకుర్తి ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అల్పాహారం అందజేస్తానని ప్రకటించిన ఎమ్మెల్యేను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

బీఎల్వోలకు అన్ని పార్టీ ప్రతినిధులు సహకరించాలి

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 25: కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణలో బీఎల్వోలకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మానకొండూర్ తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. మానకొండూర్ తహసీల్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాకేశ్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సమీన, గిర్దావర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన

చొప్పదండి, సెప్టెంబర్ 25: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై ఎస్ఐ అనూష అవగాహన కల్పించారు. వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శరత్ రెడ్డి, పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

చొప్పదండి, సెప్టెంబర్ 25: పట్టణానికి చెందిన కృష్ణయ్య అనే వ్యక్తి రూ. 16 వేల విలువైన తన సెల్‌ఫోన్ ఈ నెల 15న పోగొట్టుకోగా, అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి కనుగొన్నారు. పది రోజుల్లోనే ఫోన్‌ను బాధితుడికి అప్పగించామని ఎస్ఐ అనూష తెలిపారు.

'మిలీనియం ఫ్రెండ్స్' ఉదారత

చిగురుమామిడి, సెప్టెంబర్ 25: రేకొండ ప్రభుత్వ పాఠశాలల్లో 107 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన మిలీనియం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ట్, ఐడీ కార్డులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సేవా కార్యక్రమాలను పాఠశాల హెచ్‌ఎంలు విజయలక్ష్మి, మేరీ ఫ్రాన్సిస్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు సురేశ్, ప్రధాన కార్యదర్శి చిప్ప తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'చేనేత మిత్ర'ను పునరుద్ధరించాలి

వీణవంక, సెప్టెంబర్ 25: చేనేత కార్మికులకు ఆర్థికంగా లబ్ధి చేకూరేలా దోహదపడుతున్న చేనేత మిత్ర పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ కోరారు. కోర్కల్ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి 52వ వార్షిక, 60వ సర్వసభ్య సమావేశం సంఘ పర్సన్ ఇన్‌చార్జి, ఆప్కో మాజీ డైరెక్టర్ అడిగొప్పుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత బీమా పథకం గురించి వివరించారు. అంతకు ముందు ఆయా గ్రామాల సంఘ చైర్మన్లు, అధికారులను సన్మానించారు. మాజీ జడ్పీటీసీ ఆనందం రాజమల్లయ్య, మాజీ సర్పంచ్ జడల రమేశ్, జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రం, కోర్కల్ సంఘం మేనేజర్ ప్రసాద్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

30న ఉమ్మడి జిల్లా సీనియర్స్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

కొత్తపల్లి, సెప్టెంబర్ 25 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న సీనియర్స్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన వారిని అక్టోబర్ 9 నుంచి 11 వరకు రంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9441925807 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 25: జిల్లా వ్యాప్తంగా పత్తి రైతులు పండించి పత్తిని కొనుగోలు చేయడానికి సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ల వారీగా సీసీఐ అధికారులను నియమించాలన్నారు. సమావేశంలో నాయకులు సంపత్, రమేశ్, నరేశ్, తిరుపతి, భాస్కర్ పాల్గొన్నారు.

ఏకశిల పాఠశాలలో సీడ్ బాల్స్ తయారీ



సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 25: తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో వాసవీ వనిత క్వీన్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు పదివేల సీడ్ బాల్స్‌ను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి హాజరై మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన పుట్టినరోజున ఒక మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమంలో వాసవీ వనిత క్వీన్ క్లబ్ అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి హిమబిందు, కోశాధికారి స్వప్న, పాఠశాల ప్రిన్సిపాల్ చిదురాల దినేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దూడల నరేశ్, స్టాఫ్ ఇన్‌చార్జి శరత్ బాబు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 25: కరీంనగర్ కార్పొరేషన్ 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలో పని చేస్తున్న 19 మంది మున్సిపల్ కార్మికులకు కార్పొరేటర్ కాశెట్టి లావణ్యా శ్రీనివాస్ దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ సందర్శన

కలెక్టరేట్, సెప్టెంబర్ 25: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ బుధవారం నగరంలోని బాలసదన్, శిశుగృహను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ముచ్చటించి, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బాలసదన్, శిశుగృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ తోటల పరిశీలన

గంగాధర, సెప్టెంబర్ 25 : మండలంలోని హిమ్మత్‌నగర్‌లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగులో నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, అప్లికేషన్ పద్ధతి, అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి రోహిత్, లోహియా కంపెనీ అధికారి శ్రవణ్, ఏఈవో గోపీచంద్, రైతులు పాల్గొన్నారు.

తెగులు నివారణ చర్యలపై అవగాహన

గంగాధర, సెప్టెంబర్ 25 : మండలంలోని నారాయణపూర్, కురిక్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల్లోని వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. పొలంలో బ్యాక్టీరియా ఎండు తెగులు, దోమపోటు, కంకినల్లి, పాముపొడ తెగులు గమనించి, నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రియదర్శిని, ఏవో శ్రీనివాస్, ఏఈవోలు గోపీచంద్, వెంకటస్వామి, వంశీధర్, రమ్య, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

వీణవంక/ఇల్లందకుంట/కరీంనగర్ రూరల్/ కొత్తపల్లి, సెప్టెంబర్ 25: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల్లో పంచాయతీ కార్మికులకు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో, ఇల్లందకుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో, కరీంనగర్ మండలం చామనపల్లి ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో నగునూర్ జీపీ కార్మికులకు వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన కార్మికులకు మందులు, హెల్త్ కార్డులు అందించారు. ఆయా చోట్ల ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ రైతు వేదికలో గురువారం మండల పరిధిలోని అన్ని గ్రామాల పారిశుద్ధ్య కార్మికులకు వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించి. ఆరోగ్య సంరక్షణ రికార్డు నమోదు చేయనున్నట్లు ఎంపీడీవో కె. ప్రభ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్రీడాకారుల సంబురాలు

కొత్తపల్లి, సెప్టెంబర్ 25: ఒలింపియాడ్‌లో భారత్ చదరంగం పురుషులు, మహిళల విభాగంలో మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడంపై బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాకారులు సంబురాలు జరుపుకొన్నారు. త్రివర్ణ పతాకాలతో ర్యాలీ తీశారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్ మాట్లాడుతూ, ఈ విజయం భారతీయులకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కంకటి సుజన్‌కుమార్, తాటిపల్లి సతీశ్ బాబు, గౌతమ్‌రెడ్డి, నరేన్, బాల భవన్ డైరెక్టర్ మంజుల, శ్రీధర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వీణవంక, సెప్టెంబర్ 25: తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు ఎత్తుకుపోయిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు వోరెం చందర్ కథనం ప్రకారం.. కరీంనగర్‌లో వోరెం చందర్ బంధువులు మృతిచెందగా కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం వెళ్లాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి తిరిగిరాగా, తాళం పగులగొట్టి ఉన్నది. లోనికి వెళ్లి చూసే సరికి బ్యాగులో పెట్టిన రూ.10 వేలు కనిపించకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఎలక్ట్రికల్ షాపు, వైన్ షాపులో, సోమవారం రాత్రి ఎస్సీ కాలనీలో జరిగిన వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

విద్యుత్ సిబ్బంది హరితహననం



నారాయణపూర్ వద్ద విద్యుత్ సిబ్బంది నరికి వేసిన చెట్లు

గంగాధర, సెప్టెంబర్ 25: నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఓ పవర్ లూం ఫ్యాక్టరీకి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి అడ్డుగా ఉన్నాయంటూ హరితహారం చెట్ల కొమ్మలను బుధవారం విద్యుత్ సిబ్బంది తొలగించారు. కాగా, కొద్దిగా పక్కకు జరిపి స్తంభాలు వేస్తే చెట్లకు ఇబ్బంది ఉండదని గ్రామస్తులు సూచించినా వారి మాటలు వినకుండా విద్యుత్ సిబ్బంది తమపని తాము చేసుకుపోయారు. దీంతో గ్రామస్తులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏఈ తిరుపతిని వివరణ కోరగా, పక్కనుంచి లైన్ వేయడానికి ప్రయత్నించగా మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయిందని, దీంతో రోడ్డు పక్క నుంచే వేస్తున్నామని, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను మాత్రమే తొలగిస్తున్నామని తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగించే విషయాన్ని ఎంపీవో జనార్దన్‌రెడ్డికి తెలిపామని ఏఈ చెప్పారు.

టీటీఎల్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రమేశ్

గన్నేరువరం, సెప్టెంబర్ 25: తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫోరం మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన లింగంపెల్లి రమేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాసం రత్నాకర్ నియామక పత్రాన్ని అందజేశారు.

యువజనోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

కొత్తపల్లి, సెప్టెంబర్ 25: జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించనున్న జిల్లాస్థాయి యువజనోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్ బుధవారం యువజన సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అవార్డీ సత్తినేని శ్రీనివాస్, మేము సైతం ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసిస్టు డే వేడుకలు

విద్యానగర్, సెప్టెంబర్ 25 : గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కరీంనగర్‌లో బుధవారం ప్రపంచ ఫార్మసిస్టు డే వేడుకలను దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్ నవీనా కేక్ కట్ చేసి స్టోర్‌లో వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతి, ఇగ్బాల్, శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. దేవరాజు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వెదిరలో పీహెచ్‌సీ ఏర్పాటుకు వినతి

రామడుగు, సెప్టెంబర్ 25: వెదిర గ్రామంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని టీపీసీసీ ఎస్సీ విభాగం సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

మొక్కలు నాటిన ఫార్మసీ విద్యార్థులు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 25: రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఫార్మసిస్ట్ డే సందర్భంగా పోరండ్ల గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి మౌనిక, కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

చొప్పదండి, సెప్టెంబర్ 25: ఇటీవల హుజూరాబాద్‌లో జరిగిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో చొప్పదండి మండల క్రీడాకారులు చక్కటి ప్రతిభ చూపి అండర్14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం, అండర్ 17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ తెలిపారు. క్రీడాకారులతో పాటు మండల వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, కోచ్‌లను ఎంఈవో వేణుకుమార్, హెచ్‌ఎం రాజిరెడ్డి అభినందించారు.

కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దు

ఎమ్మెల్యే గంగులకు వినతిపత్రం అందిస్తున్న దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామస్తులు

కార్పొరేషన్/ కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 25: కరీంనగర్ నగర పాలక సంస్థలో తమ గ్రామాలను విలీనం చేయవద్దంటూ దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామస్తులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాల విలీనం వల్ల వచ్చే ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ ఊరడి మల్లారెడ్డి, దుర్శేడ్ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, అరే శ్రీకాంత్, గోనె నర్సయ్య, నేరెళ్ల శ్రీనివాస్, అశోక్, రాజకమల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

కలెక్టరేట్, సెప్టెంబర్ 25: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం నిర్వహిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎం.అనిల్‌ప్రకాశ్‌కిరణ్ తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించనున్న ఈవేడుకల్లో కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొననున్నట్లు, బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 25: తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎం.అనిల్ ప్రకాశ్ కిరణ్ తెలిపారు. ఉదయం 11గంటలకు మానేరు బ్రిడ్జి, బైపాస్‌రోడ్డు సమీపంలో గల ఆయన విగ్రహం వద్ద జరిగే వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లందకుంట, సెప్టెంబర్ 25: మండలంలోని టేకుర్తి ఆదర్శ పాఠశాల, కళాశాలలో గంటల ప్రాతిపదికన బోధించడానికి అర్హత, ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ డి. ఐలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో పీజీటీ తెలుగు, టీజీటీ హిందీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తెలుగు పోస్టుకు ఎంఏ(తెలుగు), బీఈడీ, హిందీ పోస్టుకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, హెచ్‌పీటీ పూర్తి చేయడంతోపాటు అభ్యర్థులు తప్పకుండా టెట్ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 25: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయ ఉపాధి శిక్షణ సంస్థ తిమ్మాపూర్‌లో రిఫ్రిజిరేటర్, ఏసీ రిపేరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ అక్టోబర్ 3 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ డైరెక్టర్ డి.సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9849411002,7981151653 నంబరల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు

ఇల్లందకుంట, సెప్టెంబర్ 25: దేశంలో, రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, అయినప్పటికీ పాలకవర్గ పార్టీలు వారి వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీలం అశోక్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ఎర్ర జెండా పార్టీ మాత్రమే ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాటాలు చేస్తున్నదని స్పష్టం చేశారు. ఇక్కడ నాయకులు శ్రీకాంత్, రాము, మల్లయ్య, స్వామి, రాజేందర్, వెంకన్న, రవి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

ఇల్లందకుంట, సెప్టెంబర్ 25: తెలంగాణ ఏర్పాటు కోసం ఉద్యమాలు చేసిన వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల పార్లమెంటరీ కన్వీనర్ ఎక్కటి సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు కందాల కొమురెల్లి, పెద్దికుమార్, రాజబాబు, ఎల్లయ్య, రాంచంద్రం, వీరన్న, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25 : పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంగిడి కుమార్, ముల్కల మారుతి అధ్యక్షత వహించగా, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, పీడీఎస్‌యూ బాధ్యులు జనగాం రాజశేఖర్, తుడిచెర్ల రమేశ్, రవితేజ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 25: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణాప్రతాప్ మాట్లాడుతూ.. అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలో జరుగబోయే స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవితేజ, కొయ్యడ బాబు, ఎండీ అస్లాం, రాకేశ్, శ్రీజ పాల్గొన్నారు.

గ్రామ దేవాలయ అర్చక శిక్షణ తరగతులు

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 25: గ్రామదేవాలయ అర్చక పరిషత్ ఆధ్వర్యంలో గ్రామ దేవాలయ అర్చక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ధర్మజాగరణ విభాగ్ ప్రముఖ్ ఇప్ప లచ్చన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖనిలోని ఏకలవ్య ఆశ్రమంలో ఈనెల 25 నుంచి అక్టోబర్1 వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఐదో తరగతి పూర్తి చేసి,18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల పురుషులు శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం మంచిర్యాల ప్రాంతం వారు శేఖర్ గౌడ్ (9912320589), జగిత్యాల ప్రాంతం వారు వేముల రాంరెడ్డి(9948134362), కరీంనగర్ ప్రాంతానికి చెందిన వారు విజేందర్‌రెడ్డి(9441785098), పెద్దపల్లి ప్రాంతం వారు స్వామి (9441759128) సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25: ఎస్‌యూ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షల ఫీజు అక్టోబర్ 5వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 300తో అక్టోబర్ 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని చెప్పారు.

'విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలి'

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 27న హైదరాబాద్‌లో జరిగే విద్యార్థి గర్జన సభ పోస్టర్‌ను ఉమెన్స్ కాలేజీలో ఆవిష్కరించారు. సభను జయప్రదం చేయాలని గర్ల్స్ కన్వీనర్ పూజ కోరారు. జిల్లా కమిటీ సభ్యులు మానస, సారిక, అంజలి, లావణ్య, శృతి తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ బాక్స్‌లు అందజేత

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 25: మన్నెంపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ నేపథ్యంలో దళిత కాలనీ మహిళలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు డీజే సౌండ్ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు కొయ్యల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ మండల కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆడెపు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద కళాశాలలో పారిశుధ్య కార్మికులకు సన్మానం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 25: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా 2024లో భాగంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో 10 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ హాజరుకాగా, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధర్మపురి సాగర్, బైరం మహేశ్, ఏసీవో బీ సంపత్ కుమార్, ఏవో బీ శ్రవణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో పాఠశాల వరండాకు పగుళ్లు

చిగురుమామిడి, సెప్టెంబర్ 25: కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడడంతో పాఠశాల వరండాకు పాక్షికంగా పగులు ఏర్పడ్డాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బానోతు కిషన్ నాయక్ తెలిపారు. పాఠశాల ముగిసిన తర్వాత ఈ ఘటన జరుగడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పిందని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

శంకరపట్నం, సెప్టెంబర్ 25: మండలంలోని అర్కండ్ల శివారులో ఓ ట్రాన్స్‌ఫార్మర్ పిడుగు ప్రభావంతో ధ్వంసమైంది. ఎస్ఎస్ 6/100 కేవీ సమీపంలో మంగళవారం రాత్రి పిడుగుపడడంతో ట్రాన్స్‌ఫార్మర్ గ్యాస్ ఫాం అయి ధ్వంసమై ఫెయిల్ అయిందని ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది తెలిపారు.